క్లుప్తంగా

వావిలాలలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వావిలాలలో వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

వావిలాల(తిరువూరు): మండలంలోని వావిలాలలో ఆదివారం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆవిష్కరించారు. గ్రామ పార్టీ ఆధ్వర్యాన జరిగిన విగ్రహావిష్కరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వావిలాల మాజీ సర్పంచి రాజవరపు కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్పర్సన్లు గుడిపూడి నారాయణరావు, కొమ్మినేని కిషోర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కడుపుబ్బా నవ్వించిన నాటికలు



కొండపల్లిలో నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటికలో సన్నివేశం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి నాగార్జున కళాపరిషత్ ఆధ్వర్యంలో సుంకర-టి కృష్ణ మెమోరియల్ 15వ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు హాస్య భరితంగా సాగుతున్నాయి. కరోన అనంతరం మూడేళ్లకు జరుగుతున్న నాటిక ప్రదర్శనల్లో ఐదు హాస్య నాటికలు ఎంపికచేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ కళాంజలి వారు 'మనిషి మంచోడే' నాటికతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. విజయవాడ వారు అనుకున్నదొక్కడి అయిందొక్కడి' నాటిక ప్రదర్శించారు. రెండు నాటికలు ప్రేక్షకులను నవ్వించాయి.

రేపు పశు వైద్యశిబిరం

చాట్రాయి: మండలంలోని నరసింహారావుపాలెంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇన్చార్జి పశువైద్యాధికారి శివనాగేంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పశువు రక్తం, పేడ నమూనాలను సీఏడీడీఎల్ సిబ్బంది సేకరించి పరీక్షల నిమిత్తం పంపుతారని పేర్కొన్నారు.

కార్నియాల సేకరణ



తిరువూరు: మండలంలోని ఎర్రమాడులో మృతి చెందిన వృద్ధుడి నేత్రాలను కుటుంబ సభ్యులు కరుణా ఐ బ్యాంకుకు దానమిచ్చారు. ఎర్రమాడుకు చెందిన నాళ్లా వెంకటేశ్వరరావు ఆదివారం మరణించగా గంపలగూడెం ఆర్య వైశ్య సంఘం, పతంజలి చారిటబుల్ ట్రస్టు సభ్యుల ఆధ్వర్యాన కార్నియా సేకరించారు.

నేడు కేంద్రీయ విద్యాలయాల్లో చిత్రలేఖనం పోటీలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యాన గుంటుపల్లి, విజయవాడ కేంద్రీయ విద్యాలయాల్లో చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ ఆర్.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి రాసిన పుస్తకం ఆధారంగా విద్యార్థుల్లో సృజన పెంచడానికి దేశవ్యాప్తంగా 500 కేంద్రాల్లో 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. గుంటుపల్లి, విజయవాడ కేంద్రాల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యారుల వరకు 100 మంది పాల్గొనడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఐదుగురు ఉత్తమ విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ మహాసభ



సభలో మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పీఎఫ్-95 పెన్షనర్లకు కనీసం రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్పీ శాస్త్రి అన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్లో ఆదివారం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వడానికి పార్లమెంటులో చట్టం చేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, ప్రభుదాస్, జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



వావిలాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాల బుక్లెట్ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వావిలాల(తిరువూరు): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలంలోని వావిలాలలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగేళ్లలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించడానికి యత్నిస్తున్నాయని తెలిపారు. అయితే రాష్ట్రంలో ప్రతిపక్షాలు పనికట్టుకుని విషం కక్కుతున్నాయని ధ్వజమెత్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న టీడీపీ.. నవరత్నాల ద్వారా అందే సంక్షేమ పథకాలకు గండి కొట్టాలని చూస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఏదైనా సాంకేతిక కారణంతో లబ్ధి చేకూరని వారికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని దీన్ని వినియోగించుకోవాలని రక్షణనిధి కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసురత్నం, రాజవరపు కృష్ణయ్య, కంటిపూడి గోపాలం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాధాకృష్ణారెడ్డి

నూజివీడు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో ఆదివారం ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. మద్యం సేవించి నడపడం, సెల్ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టడం, డ్రైవర్కు రెండువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, యూనిఫాం ధరించాలని స్పష్టం చేశారు. ఆటోలను రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తే ఊరుకోబోమని, నిర్ణీత ప్రదేశంలో క్రమపద్ధతిలో ఆటోలను పార్కింగ్ చేసుకోవాలని చెప్పారు. వన్వేలను అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని, వెనుక నుంచి ఏవైనా వాహనాలు వస్తున్నాయనే విషయాన్ని చూడకుండానే ఆటోలను యూటర్న్ తీసుకుంటున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

గంపలగూడెం: మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం ఆధార్కు సంబంధించి ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుందిరాలపాడు గ్రామ సచివాలయం ,తోటమూల సరస్వతీ విద్యాలయాల్లో నిర్వహించే క్యాంప్లను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కేంద్రం తీరుపై నేడు నిరసన

నూజివీడు: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న పట్టణంలోని సబ్కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజలు కేంద్రం తీరును వ్యతిరేకించాలని పేర్కొన్నారు.

నేడు బలివేలో ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం

ముసునూరు: చారిత్రక ప్రసిద్ధ శైవక్షేత్రం బలివేలో ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు జరగనున్న బలే రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై నూజివీడు సబ్కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు బలివే ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమావేశం జరుగుతుందన్నారు. అధికారులు తమ శాఖ సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఏడుగురు ఉపాధ్యాయులకు తాత్కాలిక పదోన్నతులు

నూజివీడు: మండలంలోని ఏడుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా తాత్కాలిక పదోన్నతులు పొందారు. వీరందరూ ఈ నెల 23న ప్రమోషన్ పొందిన అనంతరం కేటాయించిన పాఠశాలల్లో చేరనున్నారు. వేంపాడు ఎంపీపీ స్కూల్లో పని చేస్తున్న సాకా రవి కోటవారిగూడెం హైస్కూల్కు, పల్లెర్లమూడి (మెయిన్) పాఠశాలల్లో పనిచేస్తున్న పిల్లా జోజప్ప పట్టణంలోని యానాది కాలనీ యూపీ స్కూల్కు, పల్లెర్లమూడి ఎస్సీ కాలనీ స్కూల్లో పనిచేస్తున్న మాణిక్యాలరావు దేవరగుంట హైస్కూల్కు, ముక్కొల్లుపాడు యూపీ స్కూల్కు చెందిన లతారాణి పాతరావిచర్ల యూపీ స్కూల్కు, పోతురెడ్డిపల్లి ఎంపీయూపీ స్కూల్కు చెందిన పద్మావతి పోలసానపల్లి యూపీ స్కూల్కు, ముక్కొల్లుపాడు యూపీ స్కూల్కు చెందిన ఎం.శ్రీదేవి అన్నవరం హైస్కూల్కు, నూజివీడు పట్టణంలోని ఎస్కేహెచ్ పాఠశాలకు చెందిన జయరమణ విజయవాడ రూరల్ కంద్రికకు కేటాయిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం



క్రెడాయ్ పోటీల్లో బహుమతి అందుకొంటున్న ఈడా వేద్రాద్రి

విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజినీర్ ఈడా వేద్రాద్రి, ఎం.శ్రీనివాసరావు జంట క్రెడాయ్ ఏపీ బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలుగా నిలిచారు. విజయవాడలో శుక్ర, శనివారం రెండు రోజులు రాష్ట్రంలోని బిల్డర్స్కు క్రెడాయ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. టోర్నమెంట్ లో సుమారు 32 జట్లు పాల్గొనగా వేద్రాద్రి, శ్రీనివాసరావు జట్టు విజయం సాధించింది. వరుణ్ గ్రూఫ్ ఆఫ్ కంపెనీస్ ఎండీ ప్రభు కిషోర్ విజేతలకు శనివారం రాత్రి బహుమతులు అందజేశారు.

గిడుగు రామ్మూర్తి వర్ధంతి



గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు

తిరువూరు: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని తిరువూరు సిద్ధార్థ స్కూలులో ఆదివారం నిర్వహించారు. తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, విద్యార్థులు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష విశిష్టతను వివరించారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే పరిశీలన



ముసునూరులో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు: ఆయుష్మాన్ భారత్ సర్వేను తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ స్పెషల్ డ్రైవ్లో భాగంగా వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాలను ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సర్వే తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చీలి లక్ష్మి అర్లప్ప, ఈఓపీఆర్డీ అచ్యుత సత్యనారాయణ, కార్యాలయ పర్యవేక్షకుడు సాయి రాము, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

ఘనంగా ఈదర సహాయమాత ఉత్సవాలు



దివ్యపూజాబలిని నిర్వహిస్తున్న ఫాదర్లు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర నిత్య సహాయ మాత ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం తేరు ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు.సహాయమాత విగ్రహాన్ని ట్రాక్టర్పై తేరు ప్రదక్షిణ, గ్రామోత్సవం నిర్వహించగా, భక్తులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం పాప సంకీర్తన కార్యక్రమాన్ని ఈదర విచారణ గురువులు అగస్టీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి విశాఖ డివైన్ ధ్యాన కేంద్రం వీసీ ఫాదర్ మరియదాసు, ఫాదర్ జోషిలు దివ్యపూజాబలి సమర్పించారు. సహాయ విచారణ గురువు ప్రకాష్, సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మండల సచివాలయాల కన్వీనర్గా భాస్కర్ ప్రసాద్



ఆగిరిపల్లి: మండల సచివాలయాల కన్వీనర్గా ఈదులగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నందూరి భాస్కర్ ప్రసాద్ నియమితులయ్యారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని భాస్కర్ ప్రసాద్ అన్నారు. తనకు సచివాలయాల కన్వీనర్గా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడు వేణుగోపాల అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: చెక్కపల్లిలో పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.1,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై చెప్పారు.

నీటి సమస్య పరిష్కారం



వెల్వడం(మైలవరం): మండలంలోని వెల్వడం ఓసీ ఏరియాలో నీటి సమస్య పరిష్కారమైంది. ఆ ప్రాంతంలో పంచాయతీ మోటార్ మరమ్మతులకు గురవడంతో నీటి సమస్య ఎదురైంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వై.రాంభూపాల్రెడ్డి సూచనలపై సర్పంచ్ ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్ భాస్కర్ యుద్ధ ప్రాతిపదికన మోటారుకు మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు

నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామికి సూర్యనమస్కారాలు, అభిషేక అర్చనలు చేశారు. ఆవుపాలతో పొంగళ్లు చేసి స్వామికి నివేదించారు. అరుణ పారాయణం అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. నాలుగు వారాలపాటు సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు.

అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శోభనాచలుడికి పట్టువస్త్రాల సమర్పణ

ఆగిరిపల్లి: రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామిని ఆదివారం రాత్రి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, యలమర్రు ఎస్టేట్ జమిందారు, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్థానిక స్వామివారి కల్యాణ మండపంలో జరిగిన ఉత్సవంలో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పట్టువస్త్రాలు సమర్పించారు.



శోభనాచలుని కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

వైఎస్సార్ జలకళ రైతులకు వరం

నూజివీడు: వైఎస్సార్ జలకళ పథకం సన్న, చిన్నకారు రైతులకు వరమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బోర్వంచలోని రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద 12 బోర్లను ప్రభుత్వం మంజూరు చేయగా, గ్రామ శివారు అమృతనగర్లో బోర్లు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ శ్రేయస్సుకు అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతుభరోసాతో పాటు వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేసి రైతులకు ఉచితంగా వ్యవసాయ బోరును ఏర్పాటు చేసి మోటార్ను, విద్యుత్ కనెక్షన్ను ఉచితంగా అందించి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లోని రైతులు సాగు చేస్తున్న పంటలకు సాగునీటి ఇబ్బందులు తొలగుతున్నాయని తెలిపారు. ఒకచోట నీళ్ల పడకపోయినా మరోచోట డ్రిల్లింగ్ చేసి బోరును వేస్తారని చెప్పారు. దేశంలో ఏపీలో తప్ప ఏ రాష్ట్రంలో కూడా ఇలా సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేస్తున్న దాఖలాలు లేవని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను రైతు ముంగిటకు తీసుకొచ్చారన్నారు. ఐదెకరాల లోపు రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని, దీన్ని రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, సీనియర్ నాయకులు ఆరేపల్లి రాంబాబు, గుడిమళ్ల రామస్వామి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు సలీం ఖాద్రీ, ఉపసర్పంచ్ కిజర్పాషా ఖాద్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వ్యవసాయ బోరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష



లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు

మైలవరం: ఏపీ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు పరీక్ష మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగింది. కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో పరీక్షను విజయవాడ-2 రీజినల్ సెంటర్ కింద లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి 3 సెంటర్లు కలిపి 2400 మంది అభ్యర్థులను కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందిమళ్ల అప్పారావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు 2021 మంది అభ్యర్థులు హాజరవ్వగా మిగిలిన 379 మంది రాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ అభ్యర్థులకు నిర్వహించిన రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని జూపూడి నోవా నిమ్రా ఇంజినీరింగ్, నోవా ఇంజినీరింగ్, ఆర్కే ఇంజినీరింగ్, జానెట్జూనియర్ , నాగార్జున జూనియర్ కళాశాలలు, ఇబ్రహీంపట్నం చైతన్య పాఠశాలల్లో మొత్తం 3,960 మంది అభ్యర్థులను కేటాయించారు. విద్యార్థులను కళాశాల గేట్ల వద్ద సెక్యూరిటీ, పోలీస్ సిబ్బంది క్షుణంగా పరిశీలించి లోపలకు అనుమతించారు.

అంబేడ్కర్, జ్యోతిరావ్పూలేకు నివాళులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెన్కో ఎండీ శ్రీధర్, డైరెక్టర్ చంద్రశేఖరరాజు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ బి.శ్రీధర్ ఆదివారం నివాళులర్పించారు. ఈనెల 9వ తేదీన విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఎండీ శ్రీధర్ అనివార్య కారణాలతో ఆ రోజు హాజరు కాలేదు. ఎన్టీటీపీఎస్ సందర్శనకు వచ్చిన ఆయన పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఏపీ జెన్కో థర్మల్ డైరెక్టర్ చంద్రశేఖర్రాజు, సీఈ అశోక్కుమార్రెడ్డి, సీఈ (కమర్షియల్) పద్మసుజాత, యూనియన్ నేతలు ఉమావిజయ్చంద్, కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక సబ్కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మండల స్థాయి అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన జరుగుతుందని ఎంపీడీఓ పిచ్చిరెడ్డి తెలిపారు.

రేపు వాసవీ కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

ఊటుకూరు/పెనుగొలను(గంపలగూడెం): ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి గ్రామోత్సవం సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు నాళ్లా చిన్నసత్యంబాబు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా నెమలిలో గ్రామోత్సవం ప్రారంభిస్తామన్నారు.



